www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 18 మార్చి 2025
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

నాణ్యతతోనే కోకోకు గిట్టుబాటు ధర

ప్రజాశక్తి-అమలాపురం

కోకో గింజలకు మంచి గిట్టుబాటు ధరలు పొందాలంటే ఉత్పత్తుల నాణ్యతను పెంచాలని జిల్లా ఉద్యాన అధికారి బివి.రమణ సోమవారం ఒక ప్రకటనలో కోకో రైతులకు సూచించారు. కోకో గింజలకు జాతీయంగా, అంతర్జాతీయ మంచి డిమాండ్ ఉందన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించచక మార్కెట్ ఒడుదొడుకుల కారణంగా 2024లో కిలో నాణ్యమైన కోకో గింజలను రూ.950 నుంచి రూ.1,000 వరకు కొనుగోలు చేశారన్నారు. నేడు ధర రూ.550 నుంచి రూ.650 ఉందన్నారు. పసుపు చార వచ్చినా లేదా పక్వానికి వచ్చినా కాయలను పదునైన కత్తితో తొడిమ చెట్టుకు ఉండేలా హాని కలుగకుండా కోయాలని, కోసిన కాయలను 2 నుండి 3 రోజులు నిల్వ చేసిన తర్వాత పగులగొట్టి గింజలు తీయాలని సూచించారు. కాయలను కర్ర ముక్కతో మధ్యభాగంలో బద్దలు కొట్టి, గింజలను గుజ్జుతో సహా వేరుచేయాలన్నారు.

నిబంధనలా..మాకెందుకు..?

-వ్యాపారాల్లో యథేచ్ఛగా డొమెస్టిక్ సిలెండర్లు
-కమర్షియల్ గ్యాస్ వినియోగం అరకొరే
-తనిఖీలు చేయని పౌరసరఫరాల శాఖ.?

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

గృహ అవసరాలకు వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్లు పక్కదారి పడుతున్నాయి. నిబంధనల ప్రకారం వాటిని వ్యాపార సంస్థలలో వినియోగించడానికి వీలు లేదు. అయితే అధికారులు నిర్లక్ష్యం వలన వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. యథేచ్ఛగా వాటిని వినియోగిస్తున్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 16.77లక్షల మంది గ్యాస్ వినియోగదారులున్నారు. వీరిలో గృహ అవసర వినియోగదారులు దాదాపు 15.10 లక్షల మంది ఉన్నారు. నెలకు సరాసరి 7.5 లక్షల గ్యాస్ సిలెండర్ల వినియోగం ఉంటుంది. వాణిజ్య

కాకినాడలో ఒక వ్యాపార కేంద్రంలో డొమెస్టిక్ గ్యాస్ వినియోగం

గ్యాస్ కనెక్షన్లు సుమారు లక్ష వరకు ఉన్నాయి. వ్యాపార పనులకు వినియోగించే వాణిజ్య గ్యాస్ కనెక్షన్ల సంఖ్యకు అనుగుణంగా నిబంధనల మేరకు వినియోగం ఉండడం లేదు. 19 కేజీలు, 5 కేజీల గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

విచ్చలవిడిగా వినియోగం

టీ, కాఫీ, టిఫిన్ హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్ సెంటర్లు, భజ్జీ కొట్లు, కళ్యాణ మండపాలు ఇలా అనేక వ్యాపార సంస్థలు వద్ద ఇబ్బడిముబ్బడిగా డొమెస్టిక్ సిలెండర్లనే వాడుతున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం, మండపేట, పిఠాపురం, తుని, అన్నవరం, సామర్లకోట, పెద్దాపురం, అమలాపురం ఇలా పలు చోట్ల ఎక్కువగా వందల్లో వ్యాపారులు గ్యాస్ సిలెండర్లను ఇష్టారీతిన తమ వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 60 నుంచి 70 వేల వరకూ గ్యాస్ ఉపయోగించే దుకాణాలు ఉంటాయి. ఈ సంఖ్యకు అనుగుణంగా వాణిజ్య సిలిండర్లను వాడాల్సి ఉండగా కేవలం వందల్లోనే వీటిని వినియోగిస్తున్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గృహ అవసరాలకు వాడే సిలెండర్లను మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఎక్కడ చూసినా వీటి వినియోగమే ఎక్కువగా కనిపిస్తుంది. బహిరంగంగానే డొమెస్టిక్ బండలను వాడుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. గ్యాస్ ఏజెన్సీలు నిబంధనలను పక్కనపెట్టి గృహ అవసర సిలిండర్లను వాణిజ్య దుకాణాలకు సైతం వేస్తుండడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాణిజ్య బండలను వినియోగించాలని నిబంధనలు ఉన్నా పౌరసరఫరాల శాఖ అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. వీటిపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి ఉంది. అయితే నామమాత్రపు తనిఖీలతోనే సరిపెడుతూ మామూళ్ల మత్తులో ఉన్నారన్న ఆరోపణలు సంబంధిత శాఖ అధికారులపై వినిపిస్తున్నాయి. సిలిండర్లను సరఫరా చేసే కొంతమంది సిబ్బంది వంట గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు విక్రయిస్తున్నారు. ఇదంతా ఏజెన్సీల కనుసన్నల్లోనే జరుగుతోంది.

ప్రస్తుతం వాణిజ్య సిలిండర్ రూ.2వేలకు పైనే ఉంది. గృహ అవసరాల సిలెండర్ రూ.870 ఉండడంతో కొందరు మామూళ్లకు అలవాటు పడి వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ధరలో సగానికి పైగా తేడా ఉండడంతో వ్యాపారులు డొమెస్టిక్ బండలపైనే మక్కువ చూపుతున్నారు. మరోవైపు అటు వినియోగదారులపై సైతం అధిక ధరలకు ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారు. ఈ వ్యవహారంపై పలుమార్లు ఫిర్యాదులు వెళుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం విశేషం. ఈ నేపథ్యంలో పక్కదారి పడుతున్న గృహ వినియోగ సిలిండర్ల విషయంలో అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

తనిఖీలు ముమ్మరం చేస్తాం

గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లు అక్రమంగా వాడితే చట్టరీత్యా నేరం. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. ఫిర్యాదులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. ఈ నెలలో ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశాం. ఎక్కడైనా డొమెస్టిక్ గ్యాస్ వాడకం జరిగితే మాకు ఫిర్యాదులు చేయాలి. అటువంటి వారిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

-ఆర్ఎస్ఎస్ సత్యనారాయణరాజు, డిఎస్ఒ

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం, ముమ్మిడివరం

పదవ తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కొంకాపల్లి మున్సిపల్ హైస్కూల్‌లో పరీక్షల నిర్వహణ సరళిని ఆయన పరిశీలించారు. పరీక్షా కేంద్రంలోని తరగతి గదుల్లోకి వెళ్లి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.

అమలాపురంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ముమ్మిడివరం జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా 110 పరీక్షా కేంద్రాలకు సంబంధించి 19,046 మంది విద్యార్థులకుగాను 18,942 మంది హాజరయ్యారని, 104 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సలీం బాషా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కానీ మాస్ కాపీయింగ్ గాని జరగలేదని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ఐదుచోట్ల పరీక్షా కేంద్రాలను తాను, డిప్యూటీ డిఇఒ 13 చోట్ల, ఎసి 5 చోట్ల, ఫ్లయింగ్ స్క్వాడ్ 28 చోట్ల తనిఖీలు చేశారన్నారు. తెలుగు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలనే సూచనల మేరకు ఎట్టి పరిస్థితుల్లోనూ జెరాక్స్ షాపులు తెరవకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాలలో మౌలిక సదుపాయాలతో పాటు వేసవి దృష్ట్యా విద్యార్థులకు తాగునీటి సదుపాయం విషయమై చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాలలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోనులు తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాల ఏర్పాటు చేసి వాటిని పర్యవేక్షించాలని సూచించారు. ప్రశ్నపత్రాలను పటిష్టమైన భద్రత మధ్య తరలించాలని, పరీక్షల చీఫ్ సూపరిండెంట్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

ఎండతో రోడ్లపై జన సంచారం నిల్

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఈ ఏడాది మార్చి రెండో వారం నుంచి ఉష్ణోగ్రతలు దంచి కొడుతున్నాయి. భానుడి భగభగలు తాళలేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూ వాతావరణం తలపిస్తున్నాయి. రామచంద్రపురం మెయిన్ రోడ్డు, కాకినాడ మెయిన్ రోడ్, ద్రాక్షరామ యానం మెయిన్ రోడ్లు జనసంచారం లేక వెలవెల బోయాయి. ఉదయం 11 గంటల నుండి సూర్య ప్రతాపం మొదలవుతోంది. దీంతో ఒక్క పూతతో జనం అల్లాడిపోతున్నారు. ఇక ప్రయాణాలు వాయిదాలు వేసుకుంటున్నారు. వర్తకులు వ్యాపారులు సైతం మధ్యాహ్న సమయంలో షాపులు మూసివేసి ఇంటికి వెళ్లిపోవడంతో మెయిన్ రోడ్లన్నీ కర్ఫ్యూ వాతావరణం తలపిస్తున్నాయి. ఇప్పటికే పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రానున్న నాలుగైదు రోజుల్లో మరింతగా పెరుగుతాయి తెలియడంతో సామాన్యులు అడలిపోతున్నారు. ఇక పల్లెల్లోనూ మధ్యాహ్న సమయంలో రోడ్లన్నీ నిర్మాణస్యంగా మారుతున్నాయి.

నిర్మానుష్యంగా రామచంద్రపురం పట్టణంలో మెయిన్ రోడ్

మహిళలు పారిశ్రామికవేత్తలు అవ్వాలి

ప్రజాశక్తి-మామిడికుదురు

ప్రతి కుటుంబంలో ఒక మహిళ పారిశ్రామికవేత్త అవ్వాలనే లక్ష్యంతో మహిళల జీవనోపాధిపై సర్వే నిర్వహిస్తున్నట్టు డిపిఎం ఎల్.అన్నపూర్ణ అన్నారు. విజయవాడ సెర్ప్ ముఖ్యకార్య నిర్వహణాధికారి ఆదేశాల మేరకు మామిడికుదురు మండలం మహిళా సమాఖ్య పరిధిలో సెర్ప్ ఆధ్వర్యంలో సోమవారం సర్వే చేపట్టారు. జిల్లాలో ప్రతి కుటుంబంలో పారిశ్రామికవేత్త ఉండాలన్న లక్ష్యంతో మామిడికుదురు మండలంలో నగరం క్లస్టర్‌ను ఎంపిక చేశారన్నారు. ఈ క్లస్టర్ పరిధిలో అప్పనపల్లి, పెదపట్నం, పెదపట్నంలంక, మొగలికుదురు, నగరం గ్రామ పంచయతీలను ఎంచుకున్నట్లు తెలిపారు. ప్రతి ఎస్‌హెచ్‌జి సభ్యురాలు వారి అప్పు వివరాలు వారి కుటుంబ వివరాలు, 2025 -26లో వారు నిర్వహించే జీవనోపాధి కార్యక్రమంపై ఎలాంటి రుణాలు అవసరం అవుతాయి, ఎప్పుడు అవసరమవుతాయి అనే ప్రణాళికను తయారు చేసుకునేందుకు నగరం క్లస్టర్‌లో ఉన్న 5 గ్రామ పంచాయతీలను పైలట్ ప్రాజెక్ట్ కింద సర్వే చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఎ గణేష్, హెష్‌డి ఎపిఎం విజయలక్ష్మి, మండల మహిళా సమాఖ్య ఎపిఎం డి.వరాల బాబు, సిసిఎస్ ఆనందబాబు, కె.నాగార్జున, ఒబిలు, విఒఎలు పాల్గొన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న డిపిఎం అన్నపూర్ణ

మలేషియాలో చిక్కుకున్న మహిళతో ఎన్ఆర్ఐ

మానవత్వం చాటిన ఎన్ఆర్ఐ

ప్రజాశక్తి-మామిడికుదురు

కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన గంగులకుర్తి చంద్రావతి అనే మహిళ ఏజెంట్ మోసం వల్ల మలేషియాలో చిక్కుకుపోయి ఇబ్బందులు పడుతుండగా ఆమెను ఎన్ఆర్ఐ ఒక ఇంటికి పంపేలా ఏర్పాట్లు చేసి ఆదుకున్నారు. జనసేన పార్టీ నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమంలో ఈ విషయమైన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ వినతి అందజేశారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ శ్రీనివాస్ జనసేన నాయకుడు దాసరి కిరణ్, మలేషియా ఎన్ఆర్ఐ టీము ఫౌండర్ బొలిశెట్టి శ్రీరాములును సంప్రదించారు. వారి పిలుపుతో ఆమె వివరాలు సేకరించి ఆమెను మలేషియాలో ఉన్న భారతీయ రాయబారి శాఖ అధికారులతో మాట్లాడి ఏర్పాట్లు మొదలుపెట్టారు. మలేషియా అధికారులు వేసిన జరిమానాలను చెల్లించి, మలేషియా నుంచి విశాఖపట్నం విమానం టికెట్ తీసి ఇంటికి పంపించారు. యలమంచిలి ఎంఎల్ఎ సుందరపు విజయ్ కుమార్ ఆర్థిక సాయం అందజేశారని ఎన్ఆర్ఐ బొలిసెట్టి శ్రీరామ్ తెలిపారు.

సారా నిర్మూలనే ధ్యేయంగా నవోదయం

ప్రజాశక్తి-అమలాపురం

సారా నిర్మూలనే లక్ష్యంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ముద్రించిన నవోదయం 2.0 పోస్టర్‌ను కలెక్టర్ ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సారా వల్ల ఎంతోమంది చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోతున్నారని దీనివల్ల కుటుంబాలు చిన్నాభిన్నమై సామాజికంగా ఆర్థికంగా వీధిన పడుతున్నాయన్నారు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం సారా సంపూర్ణ నిర్మూలనే ధ్యేయంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. నవోదయం 2.0 కార్యక్రమాల ద్వారా సారా దుష్పలితాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, సారాకు బానిసలైన వారికి పునరావాసం కల్పించడం, నాటు సారా అమ్మకమే వృత్తిగా జీవించే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఎవరైనా సారా విక్రయిస్తుంటే టోల్ ఫ్రీ నెంబర్ 14405కి సమాచారం అందించాలని ఎక్సైజ్ సూపరిండెంట్ ఇకెఎస్‌వి.ప్రసాద్ తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ శివ శంకర్ ప్రసాద్, జిల్లా అటవీ అధికారి ఎంవి.ప్రసాదరావు, ఎఇఎస్ జి.అమరబాబు, అమలాపురం, రాజోలు, రామచంద్రపురం, కొత్తపేట ఎక్సైజ్ సిఐలు వి.సత్యనారాయణ, కె.వీరబాబు, పి.శ్రీనివాసులు, కె.కాత్యాయని, ఎల్.చిరంజీవి పాల్గొన్నారు.

జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్



తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ముమ్మిడివరం తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం తాలూకా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాల్లో భాగంగా స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద తాలూకా సంఘం అధ్యక్షుడు రెడ్డి వీరాస్వామి ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల డిఎ, పిఆర్‌సి, పిఎఫ్, గ్రూప్ ఇన్స్యూరెన్స్‌కు సంబంధించిన హెల్త్ కార్డుల బకాయిలు విడుదల చేయాలని, 12వ పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని, తగు రీతిలో ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో ఉద్యమ కార్యాచరణను రూపొందించి ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి రాము, వైవి.రమణమూర్తి, జనిపల్లి సత్యనారాయణ, నేరేడుమిల్లి అబ్బులు, కోలా వెంకటేశ్వరరావు, పి.రామదాసు, బి.వరప్రసాదరావు, బీర కృష్ణమూర్తి, కె.సత్య నారాయణ, నాగేశ్వరరావు, పి.లక్ష్మణేశ్వరరావు, వి.మధుసూదనరావు పాల్గొన్నారు.

రీ ఓపెన్ కాకుండా అర్జీల పరిష్కారం

ప్రజాశక్తి-అమలాపురం

గ్రీవెన్స్‌లో అందే అర్జీలను నాణ్యతతో రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డిఆర్ఒ బిఎల్ఎన్.రాజకుమారి, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ శివ శంకర్ ప్రసాద్, డ్వామా పీడీ మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణమూర్తితో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులందరూ గ్రీవెన్స్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి తప్పకుండా వ్యక్తిగతంగా అర్జీలను ఓపెన్ చేసి చూడాలన్నారు. వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అవగాహన చేసుకోవడం, క్షేత్రస్థాయిలో అర్జీదారుని వద్దకు వెళ్లి సమస్య గురించి మాట్లాడడం, సమస్యను పరిష్కరించలేని పక్షంలో అందుకు గల కారణాలను అర్జీదారులకు వివరించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రస్థాయిలో ఆడిట్ టీములు అర్జీదారులకు ఫోన్ చేసి అర్జీల పరిష్కారంపై సంతృప్తి చెందారా లేదా అన్న విషయాన్ని అడిగి తెలుసుకుంటున్నారని అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. మండల, డివిజన్ స్థాయిలో కూడా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా ఆయా మండల, డివిజన్ కేంద్రాలలో అర్జీలను సమర్పించి పరిష్కార మార్గాలు పొందొచ్చన్నారు. ఈ నెల 24, 25న అమరావతిలో కలెక్టర్స్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లాకు సంబంధించి శాఖల వారీగా సంబంధిత శాఖలలో ఉన్న సమస్యలను నివేదిక రూపంలో కలెక్టరేట్‌కు సమర్పించాలన్నారు. ఈ నెల 18 నుంచి 20 వరకు శాఖల వారీగా జిల్లా స్థాయిలో సమీక్షించి జిల్లాలోని ప్రధాన సమస్యలను కలెక్టర్స్ కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించే దిశగా చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, డిసిహెచ్ఎస్ కార్తీక్, సిపిఒ వెంకటేశ్వర్లు, సిహెచ్ఎన్‌వి.కృష్ణారెడ్డి, డిపిఒ శాంత లక్ష్మి, టి.ప్రసాద్, పిఆర్.రామకష్ణారెడ్డి, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

టిడిపి నేత వల్లూరి సురేష్ మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, యూనిట్ ఇన్‌ఛార్జి వల్లూరి సురేష్ సోమవారం మృతి చెందారు. ఆయన మృతిపై రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సంతాపం తెలిపారు. అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా అమరావతిలో ఉన్న మంత్రి సుభాష్ వల్లూరి సురేష్ మరణ వార్త విని, విచారం వ్యక్తం చేశారు. గొప్ప వ్యక్తిత్వం కలిగిన నాయకుని కోల్పోవడం బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నియోజవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు అకాల మరణం పొందిన సురేష్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కార్టూన్ 'నిజం'

ఉద్యోగ భద్రత, వేతనాల కోసం ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

ప్రభుత్వ పాఠశాలలో శానిటేషన్ వర్కర్స్‌కు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం అమలాపురం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులు అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని, వీరికి వేతనాలు నెల నెలా రావడం లేదని తెలిపారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, 300 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించడంతో కార్మికులపై భారం పెరిగిందని తెలిపారు. ఉదయం 8:30 గంటలకు స్కూల్‌కు వెళ్లి తిరిగి సాయంత్రం ఏడు గంటల వరకు స్కూల్లోనే ఉండాల్సి వస్తోందన్నారు. పాఠశాలలు, కళాశాలను పరిశుభ్రంగా ఉంచే శానిటేషన్ ఆయా వర్కర్స్ అతి తక్కువగా రూ.6 వేల వేతనాలతో పని చేస్తున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలతో నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉండడం వల్ల కుటుంబాలను పోషించుకోలేక చాలా అవస్థలు పడుతున్నట్టు తెలిపారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, వేతనాలు పెంచాలని స్థానికంగా ఉన్న ఇతర సమస్యలను పరిష్కరించాలని, ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కనీస వేతనం రూ.26000 చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షుడు భాస్కరరావు, కార్మికులు కుసుమ, గంగా భవాని, సత్యవతి, విజయ, సీత, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

మజ్జిగ చలివేంద్రం ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

వేసవి కాలం సందర్భంగా చిందాడగరువు ఎంపిటిసి మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు దంపతులు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారం కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ప్రారంభించారు. మూడేళ్ల నుంచి ప్రతి సోమవారం గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీదారులందరికీ వెంకటేశ్వరరావు దంపతుల సాయంతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ దంపతులు చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిశాంతి, డిఆర్ఒ విశ్వేశ్వరరావు, అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్సులో సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

శ్రీసరళా దేవి కల్యాణ మండపంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే, టైక్వాండో, కుంగ్‌ఫూ పోటీలలో మండల కేంద్రంలోని సిద్ధార్థ విద్యార్థుల టైక్వాండోలో ఉత్తమ ప్రతిభ కన బరిచారని స్కూల్ అధినేత కె.ముల్లారావు సోమవారం తెలిపారు. ఇందులో బ్రౌన్ బెల్ట్ కటాస్ ఎ విభాగంలో గెద్దాడ జాయ్ కిరణ్ గోల్డ్ మెడల్, బ్లూ బెల్ట్ విభాగంలో జి.షణ్ముఖ గోల్డ్ మెడల్, ఎల్లో బెల్ట్ బి.విభాగంలో బండి దైవిక్ ఆశీష్ గోల్డ్ మెడల్ సాధించి జయకేతనం ఎగురవేశారు. బ్రౌన్ బెల్ట్ బి విభాగంలో కొత్తూరు సెంటర్ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థి బుంగ అశ్విన్ గోల్డ్ మెడల్, ఎల్లో బెల్ట్ బి.విభాగంలో జి.సత్య మోహన్ మణికంఠ, సిల్వర్ మెడల్ సాధించినట్లు కోచ్ టి.వెంకటలక్ష్మి తెలిపారు. విజేతలను శ్రీసిద్ధార్థ హైస్కూల్ అధినేత కె.ముల్లారావు, ప్రిన్సిపల్ ఎ.ఇందిరా నిర్మల, మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు, కిక్ బాక్సింగ్ కోచ్ టి.లక్ష్మీసందీప్ కిరణ్ అభినందించారు.

మెడల్స్ సాధించిన విజేతలతో గ్రాండ్ మాస్టర్ అబ్బులు

పిల్లలను కాలువలో తోసేసిన తండ్రి

కుమార్తె మృతి, బాలుని రక్షించిన స్థానికులు
అప్పుల బాధ తాళలేకే అఘాయిత్యం
దొరకని తండ్రి ఆచూకీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

పిల్లలకు కాలువలోకి తోసి, అనంతరం తానూ కనిపించకుండా పోయాడో తండ్రి. ఈ ఘటన రామచంద్రపురం మండలంలోని నెలపర్తిపాడు గ్రామంలోని సోమవారం చోటుచేసుకుంది. రెండు రోజుల క్రితం కాకినాడలో ఇద్దరు పిల్లల హత్యచేసి, తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువక ముందే అదే తరహాలో మరో ఘటన చోటు చేసుకోవడంతో చర్చనీయాంశమైంది.

రాయవరం మండలం వెంటూరుకు చెందిన పిల్లి రాజు, పిల్లి విజయ భార్యాభర్తలు. వారికి కుమారుడు సందీప్(10), కుమార్తె కారుణ్య(6) ఉన్నారు. స్టీల్ సామాన్లు, ఇతరత్రా సామగ్రిని ఇన్‌స్టాల్‌మెంట్లపై అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు పిల్లలను రామచంద్రపురంలోని ప్రైవేట్ స్కూల్లో చదివిస్తున్నాడు. కుటుంబ పోషణ, వ్యాపారం నిమిత్తం దొరికిన చోటల్లా అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక తరచూ భార్యభర్తల వద్ద బాధపడుతూ ఉండేవాడు. అందరం కలిసి ఆత్మహత్య చేసుకుందామని పలుమార్లు భార్య వద్ద ప్రస్తావించి నట్టు స్థానికులు చెబుతున్నారు. దానికి భార్య అంగీకరించక పోవడంతో మిన్నకుండా. సోమవారం మధ్యాహ్నం స్కూల్ నుంచి తన పిల్లలను ఇంటికి తీసుకొచ్చాడు. వారిని ఆడిస్తూ నెలపర్తిపాడు పంట కాలువ వద్దకు చేరుకున్నాడు. కాలువ చెంతన కొంత దూరం నడిచిన తన ఇద్దరు పిల్లలని పంట కాలువలోకి తోసి పరారయ్యాడు. పిల్లలు ఆహాకారాలు విన్న స్థానికులు పంట కాలవలోనికి దిగి అక్కడ తుప్పలలో వేలాడుతున్న బాలుడిని రక్షించారు. చిన్నారి కారుణ్య అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాలిక మృతదేహాన్ని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాలుడిని తల్లికి అప్పగించారు. ఈ ఘటనకు కారకుడైన పిల్లి రాజు పరారయ్యాడా లేదా తానూ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడా? అనేది తెలియాల్సి ఉంది.

చిన్నారి మృతదేహం

చిన్నారితో తండ్రి రాజు (ఫైల్ ఫొటో)

ప్రశాంతంగా పది పరీక్షలు

పదో తరగతి పరీక్షలు సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా సాగాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

మామిడికుదురు మండల పరిధిలో పదో తరగతి తెలుగు పరీక్షకు 13 మంది విద్యార్థులు గైరాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. 1048 రెగ్యులర్ విద్యార్థులకుగాను 1037 విద్యార్థులు హాజరు కాగా 11 మంది విద్యార్థులు గైరాజరయినారన్నారు. 5 మంది ప్రైవేట్ విద్యార్థులకు 3 విద్యార్థులు హాజరు కాగా 2 విద్యార్థులు గైరాజరైనరన్నారు. మొత్తం 1,053 మంది విద్యార్థులకుగాను 1,040 హాజరు కాగా 13 విద్యార్థులు గైరాజరైనారని తెలిపారు.

ఐ.పోలవరం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు మండల విద్యాశాఖాధికారులు ఎన్.కొండారెడ్డి, వి.సురేష్ బాబు తెలిపారు. మండలంలో 11 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 5 ప్రవేటు ఉన్నత పాఠశాలల ద్వార బాలురు 365 మంది, బాలికలు 432 మంది మొత్తం 797 మంది విద్యార్థులు పరీక్షాలు హాజరైనట్టు తెలిపారు. ఐ.పోలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ ఎ-సెంటర్ నుండి 200మంది, బి-సెంటర్ నుండి 177 మంది, మురమళ్ల హైస్కూల్ నుండి 240 మంది, సాయి ఎలిమెంటరీ హైస్కూల్ నుండి 180 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. పరీక్షల నిర్వహణ నిమిత్తం నాలుగో సెంటర్‌కు నలుగురు చీఫ్ సూపరింటెంట్లు, నలుగురు డిపార్టుమెంట్ అధికారులు, 42 మంది ఇన్విజిలేటర్లను నియమించడమైనదని అన్నారు.

కపిలేశ్వరపురం మండలంలోని సోమవారం నుండి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 470 మంది విద్యార్థులు ఎస్ ఎస్ సి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. అంగర జడ్పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పరీక్ష కేంద్రం ఎ .బి ,సెంటర్లలో మొత్తం 315 మంది విద్యార్థులకు 314 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు, అంగర ఎ పరీక్షా కేంద్రంలో 179 మంది విద్యార్థు లకు 178 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఒక విద్యార్థి హాజరు కాలేదని డివో శ్రీనివాస్ తెలిపారు. అంగర బి పరీక్ష కేంద్రంలో 135 మంది విద్యార్థులకు 135 మంది విద్యార్థులు హాజరైనట్లు డివో సురేంద్ర తెలిపారు. కపిలేశ్వరపురం పరీక్ష కేంద్రంలో 133 మంది విద్యార్థు లకు 133 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు డివో వై రాధాకృష్ణ తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఎంఇఒ కె.తాతారావు పరిశీలించారు.

ఉప్పలగుప్తం మండలంలోని గొల్లవిల్లి, చల్లపల్లి, భీమనపల్లి, ఎన్.కొత్తపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో సోమవారం నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో 589 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా 584 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యి పరీక్ష రాశారు. ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. గొల్లవిల్లి పరీక్షా కేంద్రంలో ప్రత్యేక గదిలో భవిత కేంద్రానికి చెందిన నలుగురు వైఖల్య విద్యార్థులు సహచర విద్యార్థుల సహకారంతో పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాలను తహశీల్దార్ విఎస్ దివాకర్ పర్యవేక్షించారు. ఎస్ఐ,సిహెచ్.రాజేష్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించారు.

కె.గంగవరం మండలంలో సోమవారం ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు పామర్రు హైస్కూల్లో 165 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. దంగేరు హైస్కూల్లో 133 మంది పూర్తిగా హాజరుకాగా కోటిపల్లి హైస్కూల్లో 70 మంది విద్యార్థులకు 70 మంది పరీక్షలు రాశారు. మండలంలో గల హైస్కూల్లో 85 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా వారిలో 84 మంది హాజరయ్యారు కేవలం ఒకరు మాత్రమే హాజరు కాలేదని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. మొదటిరోజు జరిగిన తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరగగా విద్యార్థులంతా పరీక్షలకు హాజరు అయ్యారని ఈ సందర్భంగా అధికారులు వివరించారు.

ఉప్పలగుప్తంలో పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు

ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి

ప్రజాశక్తి - గండేపల్లి

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణ బయట చలి వేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఎంపిపి చలగళ్ళ దొరబాబు, ఎంపిడిఒ నాతి బుజ్జి సోమవారం ప్రారంభించారు, ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రోజురోజుకి పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని వేసవికాలంలో ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు సహకరించాలని అన్నారు. వివిధ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు, నేషనల్ హైవేపై వెళ్లే ప్రయాణికులకు దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ రోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జూన్ మొదటి వారం వరకూ ఈ చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఎఒ కె.చంద్రరావు, ఎంఇఒ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

బస్ షెల్టర్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక పాత రిజిస్టర్ కార్యాలయం వద్ద, సిబిఎం సెంటర్ వద్ద రూ.2.50 లక్షలతో నిర్మించనున్న బస్సు షెల్టర్ల పనులకు శంకుస్థాపన సోమవారం జరిగింది. దాత వెలగ రాజేశ్వరరావు సహకారంతో షెల్టర్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి పట్టణ కార్యదర్శి బడుగు శ్రీకాంత్, దాత రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నగరంలో ఏకకాలంలో ఫాగింగ్ చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలో దోమల నివారణకు ఏకకాలంలో ఫాగింగ్ చేయాలని దిశ జిల్లా కమిటీ సభ్యుడు నందమూరి వీరవెంకటవినోద్ పిజిఆర్ఎస్‌లో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ దోమల నివారణ చర్యలు చేపట్టాలని నెలరోజుల కితం నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతి పత్రం అందించినట్లు చెప్పారు. అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కావున లెట్రిన్ గొట్టాలకు నెట్‌లు కట్టడం, కాలువలో ఆయిల్ బాల్స్ వేయడం, చెరువుల్లో గంబుషియా చేప పిల్లలను పెంచడం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండ్రోజు దయ బానోజీరావు, పబ్బినీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్మశానంలో నీళ్ల ట్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని కట్టమూరు సమీపంలో ఉన్న స్మశానంలో తాళ్లూరు వారి సత్రం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన మంచినీళ్ల ట్యాంకును సోమవారం సత్రం ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ తాళ్లూరి శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.లక్షతో 3 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యు లు తాళ్లూరు ప్రసాద్, సత్తిరాజు, శ్రీనివాసు, కాంబాబు, రాజు, రవితేజ, కామేష్, కూటమి నాయకులు ఏలేటి సుబ్బారావు, సత్తిబాబు, చిక్కాల సాయిరాం పాల్గొన్నారు.

రాయితీ రుణాల కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

వివిధ కార్పొరేషన్ల ద్వారా 50 శాతం రాయితీపై రుణాలు అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపిడిఒ కె.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబిసిలకు సామాజికవర్గాల యువతను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 50 శాతం రాయితీపై రుణాలను అందించేందుకు చర్యలు తీసుకుందన్నారు. 21 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాలు వయసు గల లబ్ధిదారులు ఈ నెల 23వ తేదీ లోపు గ్రామ సచివాలయాలు, మీ సేవా కేంద్రాల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎసిటి సైన్స్ సెంటర్‌లో సోమవారం లూథరన్ హైస్కూల్ 6వ తరగతి విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై అవగాహన కల్పించారు. సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్ధా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పిండి పదార్థాల పరీక్ష, మాంసకృతుల, కొవ్వుల పరీక్షలు, ఏ ఏ వస్తువులు ఏ ఏ పదార్థాలతో తయారవుతాయి, కరిగేవి, కరగనివి, మునిగేవి, తేలివి, వడపోత వంటి ప్రయోగాలు విద్యార్థులతో చేయించారు. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మాజీ ఎంపిపి బుద్ధా వెంకట రమణమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సంతోష్ రూ.20 వేలు విలువ చేసే ప్యూజి ఫిల్మ్ కెమెరాను సైన్స్ సెంటర్‌కు బహుకరించినట్లు బుద్ధా శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రామశాస్త్రి దాత సంతోష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో
I.A. 1732/2024, ASSR. 7024/2024
Between:
ఆదిరెడ్డి నాగ వీర సత్యనారాయణ రామ్ కుమార్ ...పిటీషనరు
మరియు
యానాల శ్రీనివాస్ ...రెస్పాండెంటు
To, **యానాల శ్రీనివాస్,** తండ్రి - తాతారావు (లేటు) వయస్సు 32 సం॥ ప్రైవేట్ ఎంప్లాయ్, డో॥నెం. 5-184 కిల్లి వారి వీధి, నడకుదురు, కరప మండలం, కాకినాడ జిల్లా.
ప్రకటన:
పైన తెలిపిన కోర్టులో మీ హాజరు నిమిత్తం చివరి సారిగా **ది. 20-03-2025** సం॥ తేదీన పై కోర్టులో ఉదయం **గం. 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని మీ తరుపున ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు ఏమైన ఉన్న యెడల, శ్రీ కోర్టు వారికి తెలియజేయవలెను. లేని యెడల సదరు తీర్పు మీ పరోక్షమందు తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
మర్ల నరసింహారావు, అడ్వకేట్
డో.నెం.1-9-7, శ్రీరామ్ నగర్,
కాకినాడ - 533 003.
కాకినాడ
ది.17-3-2025 సెల్ : 9848277373

మహారాజశ్రీ కాకినాడ 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
O.S. No. 56/2015
Between :
దెయ్యాల రాంబాబు & అదర్స్ ...వాదులు
మరియు
దెయ్యాల అప్పారావు & అదర్స్ ..ప్రతివాదులు
(To ప్రతివాదులు):-
D.21 : బత్రాజు కరుణ కుమారి, W/o. గోవింద రాజులు, డో.నెం. 4-51, గొల్లపేట, ఇంద్రపాలెం గ్రామం, కాకినాడ రూరల్, కాకినాడ.
D.22 : చింతపల్లి సూర్యకళ రాజలక్ష్మి, W/o. వీరవెంకట నారాయణరెడ్డి, డో.నెం. 9-44, జయప్రకాశ్ నగర్, తూరంగి, కాకినాడ రూరల్, కాకినాడ. ...21,22 ప్రతివాదులు
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
పై నెంబరు దావాలో 21 మరియు 22 ప్రతివాదులు అయిన మీరు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు / నోటీసులు పంపినా, మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-03-2025 తేది ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
అద్దేపల్లి మురళీధర్
వాదుల తరపు అడ్వకేట్
ప్రతాప్ నగర్, కాకినాడ
కాకినాడ.
ది.17-03-2025 సెల్: **9849170270**

ప్రకటన
ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, రాజమహేంద్రవరం సెక్రటరీ గారి సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా, పెద్దాపురం వాస్తవ్యులు శ్రీ బొమ్మాడ వెంకటేష్ గారి భార్య శ్రీమతి బొమ్మాడ తులసి గారు సదరు బ్యాంక్‌లో ఋణము కొరకు దరఖాస్తు చేసుకున్నారు. వారు **ది. 11-11-2024, డాక్యుమెంట్ నెం. 11802/2024** గా షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని గారు వగైరాల వలన టి.ఎస్. నెం. 2-6-340 లో డో.నెం. 8-12-17/1 డాబా ఇల్లు కొనుగోలు చేసి సదరు ఆస్తిపై ఋణ దరఖాస్తు చేసుకున్నారు. అయితే సదరు షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని గారి వారి భార్య షేక్ జరినా బేగం గారు ది. 30-10-2023 తేదీన మరణించిన తరువాత దఖలు పడగా వారు విక్రయించినారు. అయితే దస్తావేజులో షేక్ జరీనా బేగం అని Death Certificate లో షేక్ జరీనా అని యున్నది. కావున వారి పేరు విషయంలో ఆస్తి విషయంలో ఎవరికైనా అభ్యంతరాలు ఉన్నట్లు అయితే 10 రోజుల లోపు సదరు బ్యాంక్ వారికి వ్రాత పూర్వకంగా తెలుపవలెను. లేనిచో సదరు బ్యాంక్ వారు బొమ్మాడ తులసి గారి ఋణ దరఖాస్తు స్వీకరించబడునని తెలియజేయడమైనది.
పి.మృత్యుంజయరావు
అడ్వకేట్, డో.నెం. 11-6-7
పెద్దాపురం, సెల్: 9848113611

బహిరంగ ప్రకటన
తూర్పుగోదావరి జిల్లా, కడియం మండలం, మురమండ గ్రామ డోరు నెం. 7-10రు కాపురస్తులు పోలోతు రామారావు గారి కుమారుడు పోలోతు సురేష్ అను నేను ప్రమాణముపై దాఖలు చేసుకున్న అఫిడవిట్ కమ్ ఇండెమినిటీ బాండు సంగతులు ఏమనగా,
తూర్పుగోదావరి జిల్లా, కడియం మండలం, మురమండ గ్రామం తాలూకు స్థిరాస్తికి సంబంధించిన శెటిల్‌మెంటు విడుదల దస్తావేజు ద.నెం. 139/2025 రుకు లింకు క్రయ దస్తావేజు నెం. 1032/2020 రు మిస్ అయినది. దాసరా నాగేశ్వరరావు వగైరాల వల్ల క్రియం పొందినటు వంటి క్రయ దస్తావేజు అయివున్నది. సదరు ద.నెం. 139/2025 రుకు లింకు దస్తావేజు అయివున్నది. సదరు పైన వివరించబడిన లింకు క్రయ దస్తావేజును పోగొట్టుకున్న విషయమును గురించి పోలీసు వారికి కంప్లైంట్ చేయడం కూడా జరిగినది. అలాగే ది. 18-03-2025వ సం॥రం తేదీన ప్రజాశక్తి న్యూస్ పేపర్ నందు దస్తావేజు పడిపోయినవని ప్రకటన కూడా యిచ్చియున్నాను. గనుక సదరు పై విషయములు అన్నియూ యదార్థములు అనియూ, సదరు విషయములు భవిష్యత్తులో అవాస్తవములని తెలియ వచ్చిన యెడల మీరు నాపై జరిగించు చట్టపరమైన చర్యలకు మరియు ఐ.పి.సి. 199/200 రు ప్రకారం నాపై మీరు తీసుకొని చర్యలకు నేను పూర్తి బాధ్యత వహించగలనని యిందుమూలముగా తెలియజేయుచున్నాను.
ఎన్.తాతారెడ్డి, అడ్వకేట్/ నోటరీ
రామచంద్రాపురం రామచంద్రాపురం
ది.17-3-2025 సెల్: 98866 960337

నేరాలు ఘోరాలు

చోరీకి గురైన ధాన్యం స్వాధీనం

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం మండలం రంప ఎర్రంపాలెం గ్రామానికి చెందిన గంటా బుల్లి వెంకటేశులు గోకవరం గ్రామం, రంప ఎర్రంపాలెం గ్రామాల మధ్యన పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. వరిసస్తున్న నూర్పి ధాన్యాన్ని మూటలుగా కట్టి రోడ్డు పక్కన బరకల్లో ఉంచారు. ఈ నెల 11వ తేదీ అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఈ ధాన్యాన్ని దొంగిలించారు. దీంతో వెంకటేశులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దేవీపట్నం మండలం ఇందుకూరుపేటకు చెందిన సత్తినాటి వీరబాబును నిందితునిగా గుర్తించారు. విచారించగా నేరం అంగీకరించాడు. బెట్టింగులకు అలవాటు పడి అప్పులు కావడంతో ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించామన్నారు. ఆటోపై గోకవరం పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ రోడ్డు పక్కన ఉంచిన సుమారు 70 క్వింటాలు వరి ధాన్యం దొంగిలించినట్టు గుర్తించామన్నారు. ప్రస్తుతం వీరబాబు నుండి ఒక ఆటో, 14 క్వింటాళ్ల ధాన్యాని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ధాన్యాన్ని రైతు వెంకటేశులకు అప్పగించామని తెలిపారు.

బంధన్ బ్యాంకులో ఘరానా మోసం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తమ బ్యాంకులో నుంచి గ్రూపులోన్ ఇప్పిస్తామని నమ్మబలికి సిబ్బంది లక్షలు కాజేసి పరారైన వైనం రూరల్ మండలం వలసపాకల గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు ఏడిద సూర్యకుమారి, గరగ చిన్న అమ్ములు తెలిపిన వివరాల ప్రకారం...వలసపాకల గ్రామంలో ఉన్న బంధన్ బ్యాంక్‌లో పది లక్షల లోన్ ఇప్పిస్తామని నమ్మించి ఏడిద సూర్యకుమారి నుంచి రూ.1.45 లక్షలు, గరగ చిన్న అమ్ములు దగ్గర నుంచి రూ.2.30 లక్షలను బంధన్ బ్యాంక్ రికవరీ మేనేజర్ గణేష్, ఉదయ భాస్కర్‌లు తీసుకున్నారన్నారు. ఆ సొమ్మును వేరే అకౌంట్ లోకి మళ్లించారన్నారు. ఎంతకీ తమకు లోన్ మంజూరు కాకపోవడంతో బంధన్ బ్యాంక్ మేనేజర్ సూరిబాబుకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తాము అప్పులు చేసి ఆ డబ్బులు సమకూర్చి వారికి ఇచ్చామని, ఇప్పుడు ఆ డబ్బులు పోయి లోన్ కూడా రాకపోవడంతో తమ పరిస్థితి ఏంటని బాధితులు గగ్గోలు పెట్టారు. దీనిపై బంధన్ బ్యాంక్ మేనేజర్ సూరిబాబుని మాట్లాడుతూ తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేయగా దాదాపు 70 మందిని బ్యాంకు రికవరీ బృందం మోసం చేసి రూ.6 లక్షల వసూలు చేసినట్లు గుర్తించామని తెలిపారు. రికవరీ స్టాఫ్ గణేశ్ పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అమలాపురం-చల్లపల్లి ప్రధాన పంట కాలువలో సోమవారం గుర్తుతెలియని ఒక వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు వెలికి తీశారు. మృతుని వయసు సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు ఉంటుందని ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపారు. విఆర్ఓ డి.శైలజ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గవర్నర్‌ను సత్కరిస్తున్న జెఎన్‌టియుకె విసి ప్రసాద్

గవర్నర్ నజీర్‌ను కలిసిన జెఎన్‌టియుకె విసి

ప్రజాశక్తి - కాకినాడ

జెఎన్‌టియుకె విసి సిఎస్ఆర్‌కె.ప్రసాద్ సోమవారం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను విజయవాడ రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనివర్శిటీలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, విద్యాపరమైన అంశాలు, త్వరలో నిర్వహించనున్న విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేడుకల నిర్వహణను గవర్నర్‌కు వివరించారు. రాష్ట్రంలో జెఎన్‌టియుకెకు ప్రత్యేక గుర్తింపు ఉందని, సాంకేతిక విద్యలో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలకు, విద్యా సంస్థలకు ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దాలని గవర్నర్ సూచించినట్లు విసి తెలిపారు. యూనివర్శిటీలో చేపడుతున్న మౌలిక వసతుల కల్పన, భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కూడా ఆదేశించారని తెలిపారు.


మంత్రి లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న యనమల దివ్య

జూనియర్ కాలేజీని ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి - తుని

కోటనందూరు మండలం పాత కొట్టాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రి నారా లోకేష్‌ను ఎంఎల్ఎ యనమల దివ్య కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటనను విడుదల చేశారు. పాత కొట్టాం, కొత్త కొట్టాం, లక్ష్మీదేవి పేట, అల్లిపూడి, కెఇ.చిన్నయ్యపాలెం పూర్తిగా వెనుకబడిన ప్రాంతమని, అలాగే అనకాపల్లి జిల్లా నాతవరం మండలానికి చెందిన గునుపూడి, పికె.గూడెం, చిన్నగొడుగుండు పేట, పెద్ద గొలుగొండపేట, వెదురుపల్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు 450 నుంచి 500 వరకు ఉన్నారని, వారికోసం పాత కొట్టాంలో జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఎస్టిమేట్స్, ప్రతిపాదనలతో కూడిన లేఖను మంత్రికి అందజేసినట్లు తెలిపారు.

ఘనంగా బాపనమ్మ వార్షికోత్సవం

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని పాలతోడు గ్రామ దేవత శ్రీబాపనమ్మ అమ్మవారి 11వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ప్రముఖ కంటి వైద్య నిపుణులు తేతలి సత్యనారాయణ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆలయ కమిటీ, గ్రామపెద్దలు ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పిల్లా వీర్రాజు, ప్రముఖ వక్త మేడిశెట్టి భాస్కరరావును సత్కరించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో వేలాది మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యేలేటి అనందరావు, నిమ్మలపూడి రామస్వామి, పిల్లా తాతాలు, యేలేటి వెంకట్రావు, బొబ్బిలి నాగేశ్వరరావు, సరాకుల అబ్బులు, పిల్లా అచ్చారావు, ఉల్లి వీర్రాజు, పిల్లా లక్ష్మణరావు, అన్నందేవుల వెంకట్రావు, యేలేటి సత్యనారాయణ, అన్నందేవుల బుజ్జి, బొక్కా రామకృష్ణ, మల్లిపూడి చంద్రశేఖర్, యాదగని విశ్వనాథం, పిల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సత్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్తులు

పోలేరమ్మ అమ్మవారికి వెండి కిరీటం అందజేత

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని పెదపళ్ల గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారికి గ్రామానికి చెందిన జాస్తి వంశీకులు వెండి కిరీటాన్ని అందజేశారు. రూ.2.7 లక్షల విలువైన వెండితో రూపొందించిన ఈ కిరీటాన్ని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహానికి అలంకరించచేశారు. జాస్తి సుబ్బన్న, లక్ష్మి నరసమ్మ, సూరన్న, సత్యవతి, శ్రీరాములు సూరమ్మ దంపతులు ఈ కిరీటాన్ని తయారు చేయించారు. దాత జాస్తి భాస్కరరావుకు జనసేన నాయకుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి, జాస్తి కుటుంబ సభ్యులను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాస్తి భాస్కరరావు, వీర్రాజు, దాసరి శారదాదేవి, జాస్తి వెంకటేశ్వరరావు, జాస్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీ

ప్రజాశక్తి-పి.గన్నవరం

డ్రోన్ ద్వారా ఎరువులు చల్లడం, పురుగు మందులు పిచికారీ చేయడం ప్రభావవంతంగా పని చేస్తాయని పెడ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ ఆరుమిల్లి లాల్ బహుదూర్ అన్నారు. డొక్కా సీతమ్మ పెడ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జి.పెదపూడి, గెద్దాడ గ్రామాలలో డ్రోన్ ద్వారా ఎరువులు, పురుగు మందులు వినియోగం ప్రయోగాత్మకం చేసి చూపించే కార్యక్రమం సోమవారం చేపట్టారు. టెక్నికల్ టీము రైతులతో మాట్లాడుతూ డ్రోన్ ద్వారా రసాయనాలు పిచికారీ చేయడం వల్ల ఖర్చులు తగ్గి సమయం వథా కాకుండా మందులు ప్రభావతంగా పని చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఇఒ దొంగ రామ్మోహన్, డైరెక్టర్ యర్రంశెట్టి సాయిబాబు, ఆదర్శ రైతులు జాన ప్రభాకర్ పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారీ

గ్రామపంచాయతీ కార్యాలయం, మలికిపురం
టెండరు ప్రకటన
ఠి.క.నెం.8/2025 తేది.10-03-2025

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మలికిపురం మండలం, మలికిపురం గ్రామపంచాయతీనకు ఈదిగువ నుదహరించిన సామాగ్రి సరఫరా చేయుటకు గాను సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు దాఖలునకు 20-03-2025 సం॥రం తేదీ గురువారం మధ్యాహ్నం గం॥ 3.00ల వరకు మాత్రమే సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. తదుపరి ఏవిధమైన టెండర్లు స్వీకరించబడవు. అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.30లకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో సీల్డు టెండర్లు తెరువబడును. టెండరు దాఖలు చేయగోరువారు ఈదిగువ చూపిన విధముగా ధరావత్తు చెల్లించి క్రమమైన రసీదు పొంది టెండరునకు జతపరచవలెను. ధరావత్తు కట్టని టెండర్లు స్వీకరించబడవు. మిగిలిన వివరములకై కార్యాలయం పనిచేయు వేళలలో సంప్రదించవలెను.

వ.నెం.	వివరములు	కాలపరిమితి	ధరావత్తు
1	పబ్లిక్ హెల్త్ సామాగ్రి	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-
2	స్టేషనరీ	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-
3	బుక్స్ & ఫారమ్స్	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-
4	వీధి లైట్లు రిపేరియర్	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-
5	ఆర్.డబ్ల్యూ.యస్. పైపు లైను విడిభాగములు	ది.01-4-2025 నుండి 31-3-2026 వరకు	200/-

గమనిక: పంచాయితీ సాధారణ నిధుల నిల్వలను బట్టి ప్రాధాన్యత క్రమములో చెల్లింపులు జరుపబడును.
సం/- **గెడ్డం రాజ్యలక్ష్మి** సం/- **ఐ.సుభాకరబాబు,** పంచాయితీ కార్యదర్శి
సర్పంచ్, గ్రామపంచాయితీ, మలికిపురం గ్రామపంచాయతీ, మలికిపురం

గ్రామ పంచాయతీ కార్యాలయము - ఇంద్రపాలెం
ఠి.క.నెం. 20/2024-25 తేది:18-03-2025
టెండరు నోటీసు

కాకినాడ రూరల్ మండలం, ఇంద్రపాలెం గ్రామపంచాయితీకు సంబంధించి 2025-2026 ఆర్థిక సంవత్సరములో గ్రామపంచాయితీ నిధులతో ఈ దిగువ తెలిపిన విధంగా అవసరమైన కాంట్రాక్టు పద్ధతిపై పారిశుద్య కార్మికుల సేవలు చేయుటకు, మరియు రక్షిత మంచినీరు, పారిశుద్ధ్య పనిముట్లు, పబ్లిక్ హెల్త్ కలరా మందులు, స్టేషనరీ అండ్ బుక్స్ & ఫారమ్స్ మరియు ఎలక్ట్రికల్ విడి భాగములు వగైరా సప్లయి కొరకు గాను సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు సీల్డు టెండర్లు ఈ దిగువ సంతకము చేసిన వారిచే గాని, లేదా వారి యొక్క అనుమతి పొందిన వారిచే గాని ది.27-03-2025 గురువారము మధ్యాహ్నం 12:00 గంటల వరకు తీసుకొనబడి, అదే రోజు మధ్యాహ్నం 02:00 గంటలకు అప్పటికి హాజరైన టెండరు దార్ల సమక్షంలో సీల్డు టెండర్లు తెరవబడును. సీల్డు టెండర్లు దాఖలా చేయుటకు చెల్లించవలసిన ధరావత్తు పంచాయతి కార్యదర్శి, గ్రామపంచాయతీ, ఇంద్రపాలెం వారి పేరున చెల్లుబాటు అగు విధముగా డి.డిలు /MR ద్వారా గాని చెల్లించి, చెల్లించిన రశీదును టెండరు షెడ్యూలునకు జతపరచి సీల్డు కవరు ద్వారా టెండరు సమర్పించవలెను. టెండరు షెడ్యూల్స్ ది.26-03-2025వ తేది సాయంత్రం 5:00 గంటల వరకు మాత్రమే ఇవ్వబడును. పై నిబంధనలు పాటించని టెండర్లు మరియు సకాలంలో రాని టెండర్లు స్వీకరించబడవు. టెండరు షెడ్యుళ్ళ రేటు, టెండరు షరతులు, ఇతర వివరములు ఈ కార్యాలయం పనిచేయువేళలో వచ్చి తెలుసుకొనవలెను. గ్రామ పంచాయితీ నిధుల లభ్యతను బట్టి బిల్లులు చెల్లించబడును మరియు ఎట్టికారణము చూపకుండానే టెండర్లను వాయిదా వేయుటకు గాని రద్దుపరుచుటకు గాని పంచాయితీ కార్యదర్శివారికి పూర్తి అధికారము గలదు.

వ.నెం.	టెండరు కాల పరిమితి	వివరములు	చెల్లించవలసిన టెండరు ధరావత్తు (మనిషి ఒక్కింటికి)
1.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు శానిటరీ మేస్త్రి సేవలు -2	100/-
2.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు PWS ఆపరేటర్ సేవలు -1	100/-
3.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు లైబ్రరియన్ సేవలు -1	100/-
4.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు కంప్యూటర్ ఆపరేటర్ సేవలు -1	100/-
5.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు బిల్ కలెక్టర్ సేవలు -2	100/-
6.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు డ్రైన్ క్లీనర్ సేవలు -3	100/-
7.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు పారిశుధ్య పని స్వీపర్ల సేవలు -26	100/-
8.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు ఎద్దు సప్లై దారు సేవలు -1	100/-
9.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు కార్టు డ్రైవర్ సేవలు -1	100/-
10.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు ట్రాక్టర్ డ్రైవర్ సేవలు -2	100/-
11.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	కాంట్రాక్టు బరియల్ గ్రౌండ్ వాచ్‌మెన్ సేవలు -1	100/-
12.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	రక్షిత మంచినీరు సరఫరా విడిభాగములు సప్లై	500/-
13.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	పారిశుధ్య పనిముట్ల సప్లై	500/-
14.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	పబ్లిక్ హెల్త్ కలరా మందులు (బ్లీచింగ్, ముగ్గు, పినాయిల్, దోమల మందులు వగైరా)	500/-
15.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	స్టేషనరీ, బుక్స్ అండ్ ఫారములు సప్లై కొరకు	500/-
16.	01-04-2025 నుండి 31-03-2026 వరకు	ఎలక్ట్రికల్ సామానులు, LED లైట్లు విడి భాగములు, LED లైట్లు ఫిట్టింగులు సప్లై	500/-

పైన పట్టిక నందు తెలిపిన సేవలకు మరియు వివిధ సామానుల సప్లై కొరకు టెండర్లు కోరడమైనది.
పంచాయతీ కార్యదర్శి సం/- **ప్రత్యేక అధికారి**
గ్రామ పంచాయితీ, ఇంద్రపాలెం, కాకినాడ రూరల్ మండలం గ్రామ పంచాయితీ, ఇంద్రపాలెం, కాకినాడ రూరల్ మండలం